'అన్యాయం దొరా'

'నిజమే'

'అకరమం దొరా'

'కాపనోడ్డు ఎదవ'

'ఆసేత్తో యిత్తిరి ఈసేత్తో తగలేసిరి. మా బతుకు లింతేసరా దొరా?'

'ఇచ్చేటోడెవరు. పుచ్చుకునేటోడెవరు? అంతా భగవంతుడి లీల'

'అట్టాగనుకునే యాబయేల్ల వయసు వెల్లిపోయినాది దొరా. మడుసులకిరాత కాన్ని దేవుడి కంటగట్టడం పెద్దోల్ల సరదా అయిపోయినాది, ఇప్పుడు మా మనసులో దేవుడికి సోటులేదు. మడుసుల మంచితనానికే'

'చేసిన పాపానికే ఇంతగా అనుభవిస్తున్నారు. ఇంకా దేవుణ్ణికూడ ఎందుకు పగజేసుకుంటార్రా?'

'కొలిసినన్నాల్లు మాకోరికలేం తీరిసిందని. మా కట్టాలనేం తొలిగించదని. దేవుణ్ని నమ్మినంతకాలం మాగతింతేదొరా ఇన్నేల్లకి నాకీగ్యానం కలిగినాది'

వెంకటేశులో అలాంటి జ్ఞానోదయం కలగడం బాధనిపించింది మాజీ సర్పంచ్ సుందరయ్యకు. వాళ్ళు ఎప్పటికీ పరమ దరిద్రులుగా వుండిపోవాలంటే దేవుడి మీద నమ్మకాల్ని చెరిగిపోకుండా తమలాంటి నాయకులు భక్తి నూరిపోస్తుండాలి! అదే ముఖ్యమైన చిట్కా! వారు వీరు కాకుండా వేరు వేరుగానే వుండిపోవటం వాళ్ళకి నష్టం తమకిలాభం' జీవితమంటే లాభనష్టాల బేరీజేగా!


'ఒరేవ్, దేవుడంటే నీకసలు తెలుసంట్రా ఎంటేసూ. నిర్వికారుడు, నిరంజనుడు. ఆయనకు మనకుమల్లే ముక్కూ చెవులు, కాళ్ళు, చేతులూ లేవురా. ఈ ప్రపంచానికి పరిమెంటు ఏలిక? ఎన్నికల గొడవలేదాయనకు. వోడిపోయే కర్మపట్టదు. మన ముఖాల్ని ఆయనేం రాసినా మన మంచికే. ఈచిన్న తిరకాసు తెలిస్తే మనిషికి కోరికలే వుండవు. బతుకులు సుఖంగా వెళ్ళిపోతాయి. అంతేరా, మనసు నిబ్బరంచేసుకుని ఇక యింటికెళ్ళు.'

వెంకటేశుకు మళ్ళీ మాట్లాడే అవకాశం యివ్వకుండా లోపలికి వెళ్ళిపోయాడు సుందరయ్య.

. ఒకరాయికి మొరపెట్టుకున్నా తనకు కొంత వూరట కలిగేదనుకున్నాడు వెంకటేశు. తమనేదో ఆదుకుంటాడని ఆశపడొస్తే, దేవుడికబుర్లు చెప్పటం నిజంగా వాళ్ళ తెలివే. పదవిపోయినంతమాత్రాన బుద్ధి మారతదనుకోటం తమ వెర్రితనం. అమస రానికి కీచులాడుకున్నా వాళ్ళంతా ఒక్కటే. ఆ జ్ఞానం తమకిలేదు. ఎప్పుడొస్తుందో?

నిరాశకు ప్రతీకగా చీకటి మరింత చిరాకుపరుస్తోంది వెంకటేశును. తమ గోడ వేదో ఆసలోడికి చెప్పుకుంటేనే మేలని పించింది. పదవిలో వున్నాడు ఒక చెవి నయినా వింటాడు. ఉపకారం మాట ఎట్లున్నా.

వెంకటేశుఎగుడుదిగుడు బాటన నడుస్తున్నాడు. వయసు తెచ్చిన నిస్సత్తువ, అర్ధాకలివల్ల కలిగిననీరసం అడుగుల్ని తడబడేలా చేస్తున్నాయి. ఇండ్లల్లోని గుడ్డిదీపాలకు వెలుగును దారిదాక ప్రసరించే శక్తిలేదు. జరిగిన సంఘటన గుండెల్ని తొలిచేస్తుంటే నడకవేగం పెంచాడు వెంకటేశు. ఒకటి రెండుసార్లు జారిపడబోయి నిలదొక్కుకున్నాడుకూడ. అయినా ఎక్కడోకాస్త గీరుకుపోయిన స్పృహకలిగి చేత్తో తడుము



# మారెప్పుడు? అభిమన్యు

కుంటే, కాలి బొటనవ్రేలిమీద ఆడి తగిలింది. చిన్న దెబ్బకే నెత్తురు బయటికొచ్చిందను కున్నాడు. ఎంతకీ తమనెత్తురు ఖర్చయి పోవటం తప్ప, దొరలకి చెమటబొట్టన్నా రాలని సుఖం. ఈపద్ధతి మారాలని తమ ఆరాటం! వాళ్ళతో తెరిపిలేని ! కొట్లాట కానీ గెలుపెప్పుడూ వాళ్ళదే !

కిందా మీదా పడుతూ వెంకటాద్రి ఇల్లు చేరుకున్నాడు వెంకటేశు. పంచలో హరికన్ దీపం ముఖాలు కనబడేంతగా వెలుతురు చిమ్ముతూంది. వెంకటేశుని చూడగానే వెంకటాద్రి ముఖం ముడిచాడు — నీముఖంచూస్తే మహా రోతన్నట్లు.

వెంకటేశుకు అవన్నీ అలవాటే, ఎంత మందిచీదరింపులతోనో జీవితాన్ని నెట్టు కొస్తున్నాడు.

వెంకటాద్రి ముభావంగావున్నాడు - అదే ఒక కళయినట్లు.

'అన్యాయం దొరా'

వెంకటాద్రి కాళ్ళు తీసి పైన పెట్టు కున్నాడు కుర్చీలో, బిర్రబిగిసి.

'అకరమం దొరా'

పళ్ళు గట్టిగా బిగించాడు వెంకటాద్రి.

'కోటిరెడ్డిగారు మాకు నీకలేకుండ సేసి నారు - మా బతుకులకి ఇంత సొంత సోటంటూ వుండకూడదా దొరా'

వెంకటాద్రికి ఎందుకో మాట్లాడాలని మనసైంది.

'సొంతాని కెంతయినా వుండొచ్చురా. వెంకటేసూ. కాని మనం రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించాలె. అదేమన సొంతం !'

వెంకటేశుకు ఆ పరమసత్యం బాగా తెలుసు. ధర్మబోధ చెయ్యటానికి వెంకటాద్రికేం అర్హతుందని.

'అది మాసొంతమని యీవూర్ల తెలియం దెవరికి దొరా. సొంతం కాందే సెమటోడి చిన కట్టంతో పాక లేసుకున్నామురా. మా కేటికి మరొకరిసొమ్ము కాజేసేటంత దవురు బాగ్యం?'

వెంకటాద్రి మనసు చురుమంది. అవ కాశం లేకకాని తన స్థానంలో వుండాల్సి

నంత తెలివుంది వెంకటేశుకు.

'ఎంకటేశూ, ఎంత అమాయకుడివిరా. రెక్కాడితే డొక్కాడదే మీ జనానికి, ఆ జాగా మీసొంతం సొంతం అని వాపోతావేంరా ? మీ దరిద్రానికి జాలిపడి గెవర్నమెంటు మీకు పంచిపెట్టిందని చంక లెగరేస్తున్నారు. అయెట్టాగు మీకు దక్కవురా ! నడమంత్రపుసిరి చెప్పకుండ ఎగిరిపోతుంది. అంతే జరిగింది.'

'మీరా గెవర్నమెంటు దొరలేగదా. మీరు సేసినపనికి మీరే వొప్పలేకపోతే మాకేటి దిక్కు ?' బాగా ఆలోచించి అన్నాడు వెంకటేసు.

వెంకటాద్రికోపం కట్టలు తెంచుకుంది నేరం తనమీదనే మోపుతున్నాడు వెంకటేశు. దహనకాండలో తన చెయ్యి కూడ వున్నట్లు. ఎన్ని హింసలుపెట్టినా వీళ్ళకి బుద్ధిరాదు. గోడకెయ్యకుండా నిచ్చెనెక్కాలనుకునే అల్పులు... మేకలు.

'ఎంకటేసూ, ఇన్నిమాటలు నేర్చివవు. ఇదిమాత్రం అర్థం చేసుకోలేవూ. కరణం గాడు అంతో యింతో గడ్డిమేసి మీకిచ్చిన బంజర్లను కోటిరెడ్డికి దఖలు పరుస్తానన్నడు. సగందబ్బు ముందే మింగేశాడు కరణం. ఈలోగా మాకో మంచిబుద్ధి కలిగింది. మినిష్టరుగోరు మావోరే. మావర్గం మనిషే ! మీవోళ్లకు ఆ బంజర్లు పంచిపెట్టేట్లు నానా యాతనపడి యిరకాటంలో పడ్డాను. కోటిరెడ్డి లాలూచీ నాకూ తెలవదాయె ! నన్నేం చేయమంటావు ?'

ఔనుమరి ! వెంకటాద్రి కోటిరెడ్డి చుట్టాలు. సరుపంచ్ తమోడయితే అయినోళ్ళకి అడ్డూ అపు ఏం వుంటుంది? గవిర్నమెంటుకు యిష్టంలేని పన్లుకూడ చేయగలరు. కోరుటులను ఆదొరట్టగలరు. అన్నీ చేసి హాయిగుండగలరు. పాక వేసిన్నాటినుంచి కోటిరెడ్డిగోరు అంతా యింతా కాదు. వూళ్ళో బతకాలంటే వెంటనే పీకిపారెయ్యమని ఆజ్ఞ ! పెద్దోళ్ళతో తగువు ప్రాణాలకు ముప్పని హెచ్చరింపు. తమజనం ఆచప్పట్లకు బెదరలేదు. తాము హక్కుదార్లు. హక్కును రక్షించుకోటానికి రక్తపాతానికైనా సిద్ధపడ్డారు. వాళ్ళింకా బానిసలుగా బతకదల్చుకోలేదు. కోటిరెడ్డి దుర్మార్గపు టాలోచనలను గురించి తాము వెంకటాద్రికి ముందే తెలిపారు.

'చూద్దాం, చూద్దాం... అంటూ తలాడించి వూరుకున్నడు వెంకటాద్రి. ఏం చూస్తాడో తమకి అర్థంకాలేదు. కాని తమ జనం వెంకటాద్రి తమకు అనుకూలంగానే ఏదో చెప్తడని భ్రమపడ్డరు. అందాక ఎందుకు ? తనవరకు తను ఎన్నో ఆశలు పెంచుకున్నాడు. అధికారం చెయిమారగనే. సుందరయ్య పరమ కర్కోటకుడు. వాడికి కష్టజీవులంటే కడుపుమంట. చమటచూస్తే చిరాకు. గుడ్డల్లేని వాళ్ళు కంటబడితే డోకు. వాడమసరమొస్తే ఏం లయపడతడని. దినమంత చాకిరి చేయించుకుని ఒకపూటకు చాలని కూలిస్తడు. అడిగితే అదే ఎక్కువంటడు. వాడిదృష్టిలో పేదోళ్ళు బతకటం నేరం. వాడిలాంటి దగాకోర్లు బతకతగినోళ్లు. భూమి నేలాల్చినోళ్ళు ! తాగితే మనుషుల నెత్తురేతాగాలె, తింటే మడుసుల మాంసమే తినాల ? అదీవాడి రాజకీయం. ఎట్లయితేనేం వాడు వోడిపోయినడు. పదవి అధికారం రెండు పోయినయి. ఈ కెలు తీసిన కోడయిండు. వూరికి శనొదిలిందనుకున్నరు

**జనాభా**

*ప్రపంచంలో సంతానాన్ని కనే మహిళల సంఖ్యా పెరుగుదల, జనాభా పెరుగుదల రేటు కన్న ఎక్కువగా వున్నట్లు "ప్లాన్ డ్ పేరెంట్ హుడ్ ఫెడరేషన్" అనే అంతర్జాతీయ సంస్థ హెచ్చరిస్తోంది.*

జనమంత. పదేళ్ళపీడ! వెంకటాద్రి సర్పంచయిండు. అధికారం చెయిమారితే ఏదో మారుగుతుందని మామూలుజనం కాస్తంత వుత్సాహపట్టం సహజం. ఏదో చిన్నయెత్తు మేలుచేస్తడని; పేదోళ్ళప్రేమ సంపాదించటానికి అరిచేతిలో వైకుంఠం చూపిస్తడని పిచ్చివూహలు చేసిండుజనం. కాని అంతా తారుమారు! వాణ్ణిచంపి వీడు పుట్టాడు. తెరవెనకుండి నాటకం మాడిస్తుంటడు. వెంకటాద్రి రాజకీయం వాట్టి రౌడీంతోనే. రేయయినా పగలయినా వాడనుకున్నపని చిటికెలో చేయించగలడు. వాడితో పాటు వాడోళ్ళంతా తెగబలిసి పోతున్నరు. స్థలాలు పంచేసినట్లు పేపర్లనిండ ప్రచారం! పాకలు తగలేసిన కబురు, రౌడీలు దవుర్జన్యం చేసిన వైనం వూరి పొలిమేర దాటవు. అదో రాజకీయం!

'ఏర ఎంకటేసూ! మాటావలుకు లేకుండ కూచున్నవేంటి? కొంపకెళ్ళేది లేదేంటి?' అన్నాడు వెంకటాద్రి, వెంకటేశుకు ఆలోచన సాగకుండా.

'ఎల్తాదొరా ఎల్తా, కోటిరెడ్డిగారి దరమమాని మాకు మిగిలింది బూడిదేగా! అదే కప్పుకు వడుకుంటానికి ఎల్తా, ఈవూరికి ఏలికమీరో, కోటిరెడ్డిగారో, మరి పట్నం రౌడీలో మా జనానికి అంతు పట్టకుండా వుంది. వారం తిరిగెనా, మాగురించి పట్టించుకున్నదెవరు? ఇదొరకే తెలుసుదొరా! ఇప్పుడు జరారయింది! కిందామీదా పద్దా మీదొరలంతా ఒకటే; బుద్ధులు ఒకటే; ఒకరు తుపాకితో రాజ్యమేలితే మరొకరు కుట్రతో - ఫలితం మీకు. పస్తులు, జైళ్ళు మాకు. అధికారం చెయిమారిందంటే పేర్లు మారటంతప్ప మారాత మార్చెటోడు రారని ఇప్పటికి తెలిసింది, వస్తదొరా...'.

వెంకటేశు ఒక్కవూపులో చీకట్లో కలిసిపోయాడు. దారిపొడుగునా ఆలోచనలు మనసును తొలిచేస్తున్నయి. ఏండ్లు పూండ్లు గడిచి పోతున్నయి. ఎంతమంది వెంకటాద్రులో మారిపోతున్నారు అందరూ వాళ్ళలో నించే అధికారాని కొస్తున్నారు. జనాన్ని నమిలేస్తున్నరు. మరి యీ జనం మారే దెన్నడో, ఎదురుమళ్ళే దెన్నడో, తమలో నించి తమకోసం అధికారానికొచ్చే దెప్పుడో?

వెంకటేశు ఆవేశంగా నడుస్తున్నాడు.

నిరాశగా ఆలోచిస్తున్నాడు.

నిరాశగా ఆలోచిస్తున్నాడు.

మార్పు ఎప్పుడు...ఎప్పుడు? వెంకటేశు గుండె సముద్రంలో అదొక్కటే ఘోష! *

*ప్రపంచ జనాభాలో 98 శాతం నివసించే ప్రాంతాలలో కుటుంబ నియంత్రణ గురించి దంపతులకు సరియైన పరిజ్ఞానం కలిగించటం లేదు.*